అసైన్డ్ భూములను పేదలకు అప్పగించాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో అన్యాక్రాంతమైన 24 వేల ఎకరాల అసైన్డ్ భూములు పేదలకు అప్పగించి, వాటికి హక్కులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిర్ల ప్రసాదరావు, గంగరాపు సింహాచలం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండడానికి 9/77 చట్టాన్ని తీసుకొచ్చినా, జిల్లాలో 24 వేల ఎకరాలు అలా కావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో 14,852.61 ఎకరాలు మాత్రమే పేదల వద్ద ఉన్నట్లు నిర్ధారణ చేస్తున్నారని తెలిపారు. అసైన్డ్ భూములు అన్యాక్రాంతం చేసి చేపలు, రొయ్యల చెరువులు, రియల్ ఎస్టేట్లు తదితర రూపాల్లో వినియోగించుకుంటున్నారని తెలిపారు. అసైన్డ్ భూముల సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వే చేసిన భూముల వివరాలు గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని, ప్రజలందరికీ తెలియజేసే విధంగా గ్రామాల్లో దండోరా వేయించాలని కోరారు.

తప్పు ఎవరిది..?

- శివారు భూములకు చేరని వంశ'ధార'
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక, గుర్రపుడెక్క
- నిధులు ఇవ్వని ప్రభుత్వం
- రైతులకు సమాధానం చెప్పకోలేక అధికారుల అవస్థలు

జిల్లాలో అసలే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వంశధార నీటిపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. కాలువల నుంచి సాగునీరు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈనెల 16న పలాస ప్రాంత రైతులు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు స్పందనలో వినతిపత్రం అందించారు. సాగునీరు ఎందుకు ఇవ్వలేకపోయారని కలెక్టర్ సీరియస్ అయి వంశధార ఎస్ఇకి మెమో సైతం జారీ చేశారు. వాస్తవ పరిస్థితులను విస్మరించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, గుర్రపుడెక్క తొలగింపునకు నిధులను చాలా ఆలస్యంగా విడుదల చేశారు. కాలువల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో, శివారు భూములకు సాగునీరందకపోయిన అంశం ఈ ఏడాదీ పునరావృతమైందన్న చర్చ నడుస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం వద్ద వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో, నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది.

జంగిల్ క్లియరెన్స్ పనులూ పెండింగే

నీటితీరువా నిధులతో చేపట్టే కేటగిరి-ఎ పనులూ పెండింగ్‌లో ఉన్నాయి. వంశధార ఎడమ కాలువకు సంబంధించి జంగిల్ క్లియరెన్స్, గట్లను పటిష్టపరచడం వంటి పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. టెక్కలి డివిజన్‌లో 30 పనులకు రూ.1.61 కోట్లు, నరసన్నపేట డివిజన్‌లో 29 పనులకు రూ.69 లక్షలు కేటాయించారు. పనుల కోసం టెండర్లను పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండోసారి టెండర్లను పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. రెండేళ్ల కిందట చేపట్టిన పనులకు రూ.4.16 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో, టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది.

నిధుల విడుదలలో జాప్యం

వంశధార కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క సకాలంలో తొలగించకపోవడం వల్లే శివారు భూములకు సాగునీరు అందలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నీటిని విడిచిపెట్టే సమయానికే గుర్రపుడెక్క తొలగించాల్సి ఉండగా ఆగస్టులో చేపట్టారు. వంశధార ఎడమ, కుడి కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపునకు రూ.90 లక్షలు అడిగితే, కలెక్టర్ రూ.40 లక్షలు విడుదల చేశారు. అదీ జూలైలో విడుదల చేయడంతో, పనులు పూర్తిస్థాయిలో చేపట్టడానికి అవకాశం లేకుండా పోయింది.

షట్టర్ల సమస్యకు పరిష్కారమేది?

వంశధార శివారు భూములకు షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. 2009లో సిఐడి నమోదు చేసిన కేసుపై కోర్టులో విచారణ కొనసాగుతోంది. వంశధార అధికారులు పలు సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు.

ఈ ఏడాదీ కొత్తగా షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి తలెత్తింది. శిథిలావస్థలో ఉన్న షట్టర్లతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను అటు ప్రభుత్వం, ఇటు ఉన్నతాధికారులు పరిష్కరించలేకపోయారు.

ఎన్‌సిఎల్‌తో భూగర్భ జలాలు కలుషితం

- పరిశ్రమ గాలి, ధూళితో జనం ఇబ్బులపాలు
- పొందూరులో రక్షిత నీటి కోసం రూ.50 కోట్లు కేటాయింపు
- ఆమదాలవలసకు ఇండోర్ స్టేడియం మంజూరు
- శాసనసభ స్పీకర్ తమ్మినేని

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నాగార్జున అగ్రికెమ్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సిఎల్) పరిశ్రమ కాలుష్యంతో పొందూరు ప్రాంతంలో విపరీతమైన కాలుష్యం నెలకొందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమ నుంచి వస్తున్న ధూళి, వాయువులతో భూగర్భజలాలు, గాలి కలుషితమవుతున్నాయని చెప్పారు. కాలుష్యంపై చాలాసార్లు యాజమాన్యాన్ని హెచ్చరించినా, తగిన ఏర్పాట్లు చేయాలని సూచించినా పట్టించుకోకపోవడంతో, జనం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కలుషిత పరిస్థితులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వివరించామని చెప్పారు. పొందూరు, ఎరుకులపేట, తండ్యాం, రాపాక, కృష్ణాపురం, రెడ్డిపేట, లోలుగు, భగవాన్‌దాస్‌పేట, బురిడి కంచరాం, కేశవదాసుపురం, నందివాడ తదితర గ్రామాల ప్రజానీకానికి, స్వచ్ఛమైన శుద్ధ జలాన్ని తాగునీరుగా అందించేందుకు ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. శుద్ధి చేసిన జలాన్ని రాపాక కొండపై నిర్మించే ట్యాంకులకు పంపింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. దీన్ని రెండు దశల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రెండో దశలో మజ్జిలిపేట, కోటిపల్లి, పెనుబర్తి, దల్లవలస పరిసర గ్రామాలకు ఈ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆమదాలవలసకు ఇండోర్ స్టేడియం

ఆమదాలవలస పట్టణానికి ఇండోర్ స్టేడియం మంజూరు చేస్తూ ప్రభుత్వం జిఒ నంబరు 198 విడుదల చేసిందన్నారు. స్టేడియం నిర్మాణానికి రూ.7.15 కోట్ల ఆర్థిక అనుమతులనూ జారీ చేసిందని తెలిపారు. త్వరలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి పనుల ప్రారంభోత్సవం చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందుకోసం రూ.ఏడు కోట్లు మంజూరు చేస్తూ జిఒ ఆర్‌టి నంబరు 198 విడుదలైందన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే ఆమదాలవలస క్రీడల హబ్‌గా రూపొందడం ఖాయమన్నారు. వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటజన్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌తో పాటు మరిన్ని క్రీడలకు ఇండోర్ స్టేడియం వేదికగా నిలవనుందన్నారు. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ వంటి క్రీడల ద్వారా మునుపటి వైభవాన్ని తీసుకొచ్చేందుకు ఇండోర్ స్టేడియం ఉపకరిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో సాగునీరు అందని ప్రాంతాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అందించేందుకు చొరవ చూపినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 13 గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణాలకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. వీటిలో ఆరు పథకాలు త్వరలో మంజూరు కానున్నాయన్నారు. వీటికి సంబంధించిన పరిపాలనా అనుమతులు పూర్తయినట్లు తెలిపారు.

చంద్రబాబు అరెస్టుపై జనాల్లో స్పందన లేదు

చంద్రబాబు అరెస్టుపై టిడిపి ఆందోళనలు చేస్తున్నా, జనంలో స్పందన లేదని చెప్పారు. ఆర్థిక నేరగాళ్లకు ప్రజల మద్దతు ఉండదన్నారు. ఇక టిడిపి పని అయిపోందన్నారు. జగన్‌ను 16 నెలలు జైల్లో పెట్టినా ఏమీ నిరూపించలేకపోయారని తెలిపారు. ఎంపీగా పోటీ చేసే అంశంపై స్పందిస్తూ అధిష్టానం ఏం నిర్ణయిస్తే, దాన్ని అనుసరిస్తానని చెప్పారు.

వైభవంగా కొత్తమ్మతల్లి ఉత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, కోటబొమ్మాళి

పట్టువస్త్రాలను సమర్పిస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

మూడు రోజుల పాటు నిర్వహించే కొత్తమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం అర్చకులు సుసరాపు గణపతిశర్మ పూర్ణకుంభంతో వారిని ఆహ్వానించారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి దంపతులు, వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి రోణంకి ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావుతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచీ యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాలకు వచ్చే యాత్రికుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక విద్యుత్‌నగర్ వాసులు ఉచితంగా వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఆలయంలో ఉన్న అమ్మవారి జంగిడిని అసాదీల కుటుంబీకుల పెద్ద తలపై పెట్టుకొని తల్లికి నిలయమైన రెడ్డిక వీధికి చెందిన కమ్మకట్టు చిన్నఅప్పలనాయుడు ఇంటి వరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. జంగిడిని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు రెడ్డిక వీధి నుంచి కలశాలతో ఊరేగింపుగా కొత్తమ్మతల్లి ఆలయానికి తీసుకొస్తారు.

ఇఒపై వైసిపి నాయకుల దురుసు ప్రవర్తన

కొత్తమ్మతల్లి ఆలయ ఇఒ రాధాకృష్ణపై వైసిపి నాయకులు దురుసుగా ప్రవర్తించారు. ఉత్సవాలను అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉదయం ఏడు గంటలకు ప్రారంభించాల్సి ఉండగా వారు ఆలస్యంగా వచ్చారు. షెడ్యూల్ సమయానికి వారు రాకపోవడంతో ఎనిమిది గంటలకు పట్టువస్త్రాలతో వచ్చిన ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు పట్టువస్త్రాలు సమర్పించేందుకు రావడంతో ఆలయ అధికారులు వారిని స్వాగతించారు.

వారు పూజలు చేసి వెనుదిరుగుతున్న సమయంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, ఇతర వైసిపి నాయకులు వచ్చారు. ప్రోటోకాల్ పాటించకుండా ప్రతిపక్ష నాయకులకు ప్రాధాన్యత ఇచ్చారని దువ్వాడ వాణి అనుచరులు ఇఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్సవాల నిర్వహణ ఇలాగే చేస్తారా అని మండిపడ్డారు. అచ్చెన్నాయుడును ముందుగా ఎలా స్వాగతిస్తారంటూ ఇఒను నెట్టేయడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇఒకు రక్షణగా నిలిచారు. వైసిపి నాయకులకు ఆలయ అధికారులు, పోలీసులు సర్దిచెప్పడంతో శాంతించారు.

ఎంసెట్ మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో ఎంసెట్ మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహణపై ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తప్పుపట్టారు. వేలాది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంపై మీనమేషాలు లెక్కించడం సరికాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్రం నుంచి ఏటా లక్షలాది మంది ఎంసెట్ రాస్తుంటారని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఏటా మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా, ఈ ఏడాది అర్ధాంతరంగా రెండు కౌన్సెలింగ్‌లకే పరిమితం చేయడం బాధాకరమన్నారు. తమకు నచ్చిన కళాశాలలో సీటు, ఎంచుకున్న కోర్సు రాలేదని చాలామంది 2, 3 కౌన్సెలింగ్‌లకు వరకు వెళ్తుంటారని తెలిపారు. విద్యార్థుల ఆశలపై నీళ్ల చల్లుతూ మూడో విడత కౌన్సెలింగ్ రద్దు చేసి, స్పాట్ అడ్మిషన్లకు మాత్రమే అనుమతిస్తామని చెప్పడం సరికాదన్నారు. ఇది కేవలం కళాశాలల యాజమాన్యాలకు ప్రయోజనం చేకూర్చేందుకేనని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి, ఉన్నత విద్యామండలి కమిషన్ చైర్మన్ సైతం మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీనిచ్చి తప్పడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి, వెంటనే ఎంసెట్ మూడో విడత కౌన్సెలింగ్ తేదీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ముంబైలో పొందూరు ఖాదీ కార్మికుల ప్రదర్శన

ప్రజాశక్తి - పొందూరు

వస్త్రాల తయారీ ప్రక్రియను ప్రదర్శిస్తున్న ఖాదీ కార్మికులు

ముంబైలోని ఎంఎంఆర్‌డిఎ మైదానంలో నిర్వహిస్తున్న గ్లోబల్ మెరిటైన్ సమ్మిట్‌లో పొందూరు ఖాదీ వస్త్రాల తయారీ ప్రక్రియలను ఖాదీ కార్మికులు ప్రదర్శించారు. ఖాదీ, గ్రామోద్యోగ కమిషన్ (కెవిఐసి) సిఫార్సు మేరకు ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘానికి చెందిన ఆరుగురు మహిళా ఖాదీ వడుకు పనివారులు చేపముల్లుతో పత్తిని పరిశుభ్రం చేయడం, నూలు తీయడం వంటి పలు ప్రక్రియలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘ కార్యదర్శి దండా వెంకటరమణ, జల్లేపల్లి శంకరరావు, మహిళా ఖాదీ కార్మికులు కాపల చిన్నమ్ముడు, కొండేటి సూర్యకాంతం, మాడుగుల కళ్యాణి, బస్వా జయలక్ష్మి, వి.లక్ష్మి, చదువుల సుగుణావతి తదితరులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జల జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెజెఎం పథకంలో భాగంగా ఆమదాలవలస నియోజకవర్గానికి రూ.157 కోట్లతో ప్రతి గ్రామంలోనూ పనులు మంజూరయ్యాయన్నారు. నీటి నిల్వల కోసం వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అవసరమయ్యే ప్రభుత్వ స్థలాలను గుర్తించాలన్నారు. ట్యాంకుల నిర్మాణానికి అవసరమయ్యే స్థల సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో 182 వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. వీటికి సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

జగనన్న సురక్షతో ఆరోగ్య భద్రత

ప్రజాశక్తి - ఆమదాలవలస

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్య భద్రతకు తొలి అడుగు పడిందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. పట్టణంలోని మోనింగివారి వీధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. వాలంటీర్లు, ఆరోగ్య కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వచ్చారా? ఆరోగ్య పరీక్షలు చేశారా? టోకెన్ ఇచ్చారా? సురక్ష క్యాంపు సమాచారం తెలిపారా? అని శిబిరానికి వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజల కనీస, సాధారణ స్థాయి వైద్య అవసరాలను గుర్తించి తక్షణ వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య సురక్ష దోహదపడుతుందని తెలిపారు. తద్వారా ఆరోగ్య సేవల కల్పనలో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, తహశీల్దార్ ఎం.గణపతిరావు, వైద్యులు డి.సురేష్, వార్డు సచివాలయ, మున్సిపల్, మెప్మా, అంగన్వాడీ సిబ్బంది, ప్రత్యేక వైద్యబృందం, పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెసి నవీన్

ఠాగూర్‌కు 112వ ర్యాంకు

ప్రజాశక్తి - పలాస

నీట్ సూపర్ స్పెషాలిటీ ఎం.ఎస్ జనరల్ పిజి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో కాశీబుగ్గ న్యూకాలనీకి చెందిన కిల్లి ఠాగూర్ ఆలిండియా స్థాయిలో 112వ ర్యాంకు సాధించారు. ఠాగూర్ కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఢిల్లీలోని అటల్ బిహారీ వాజ్‌పేయి మెడికల్ కళాశాలలో ఎం.ఎస్ చేశారు. ఠాగూర్ తండ్రి కోదండరావు స్వర్ణకారుడు కాగా, తల్లి ఉమ గృహిణి. సోదరుడు పాలిటెక్నికల్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఠాగూర్ ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు పరమేశ్వరరావు

పూర్వ వైభవం తీసుకొస్తాం

డిసిసి అధ్యక్షులు పరమేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకొస్తామని ఆ పార్టీ నూతన జిల్లా అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఇతర పార్టీల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులను 'మన ఇంటికి రండి' నినాదంతో తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. జిల్లాలో పదేళ్లుగా ప్రజా సమస్యలను అధికార, విపక్ష ప్రజాప్రతినిధులు, నాయకులు గాలికొదిలేశారని విమర్శించారు.

తన భుజస్కందాలపై డిసిసి బాధ్యతలు పెట్టిన కేంద్ర అధిష్టానం పెద్దలకు, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి రాకేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు సమిష్టి కృషి చేస్తామని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సనపల అన్నాజీరావు, పడి నాగభూషణరావు చెప్పారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా వ్యక్తిగత విమర్శలకు దూరంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో మమేకమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు అంబటి కృష్ణ, కోత మధుసూదనరావు, డి.గోవింద మల్లిబాబు, కొత్తకోట సింహాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది శ్రీకాకుళం జిల్లా,కవిటి మండలం, కమలాయిపుట్టుగా గ్రామానికి చెందిన

ఏదురు వాసుదేవ రావు

S/o **ఏదురు కామరాజు చెందిన పాస్ పోర్ట్ No:R2785520 జగతి నుంచి కమలాయిపుట్టుగా బైక్ పై వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయింది ఎవరికైనా దొరికిన ఎడల ఏదురు వాసుదేవ రావు కు గానీ కవిటి పోలీస్ స్టేషన్‌లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.**

7671000687

బహిరంగ ప్రకటన

నా క్లైంట్ అయినటువంటి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్.సి.బి బ్రాంచ్, శ్రీకాకుళం** వారి ఇచ్చిన బోగట్టపై ఈ బహిరంగ ప్రకటన.

నా క్లైంట్ కస్టడీలో ఉన్నటువంటి రిజిస్టరి క్రయ చీటి తేదీ 03-06-1997 డాక్యుమెంట్ నెంబర్: 1440/1997 అఫ్ శ్రీకాకుళం ఎస్.ఆర్.ఓ బ్రాంచ్ వేరే ప్రిమిసస్‌లోకి మార్చినప్పుడు పోయింది. ఈ బహిరంగ ప్రకటన మూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా. ఎవరికైనా పై పేర్కొన్న రిజిస్టరి క్రయ చీటి తేదీ 03-06-1997 **డాక్యుమెంట్ నెంబర్:1440/1997** అఫ్ ఎస్.ఆర్.ఓ శ్రీకాకుళం గల ఒరిజినల్ డాక్యుమెంట్ దొరికిన యెడల బ్రాంచ్ వారికి నేరుగా గాని లేదా నాకు అప్పగించవలసిందిగా మిక్కిలి వినయ పూర్వక ప్రార్థన

కస్పా కామేశ్వరరావు
అడ్వకేట్,
శ్రీకాకుళం,
ఫోన్ 9441050810, 8247576003.

IN THE HONOURABLE COURT OF THE 3rd Addl JUNIOR CIVIL JUDGE CUM PROHIBITION AND EXCISE COURT AT SRIKAKULAM IA 192/21 IN OS 540/2021

Between:
Dontham-chandra sekhar
--Petitioner/Plaintiff
And:
Battili Bhaskara Rao and Others
--Respondents/Defendants
To,
D-3. Kallepalli Ramarao, S/o Late Appalasuri, Driver, R/o Badurlapeta, Srikakulam Town & District.

Notice to the 3rd Defendant/Respondent

It is to Inform you that the above suit i.e OS 540/2021, on the file of The Honble court of the 3rd Addl junior civil judge Prohibhition and Excise Court at Srikakulam District is posted to **08-11-2023** for your appearance.

You are here by directed to appear before the above court **at 10.30 Am** on **08-11-2023** in Person or through advocate with out fail, otherwise the matter will be decided in your absence.

// By court Order //

PALISETTI MURALIKRISHNA
Advocate New colony
Srikakulam, Cell: 9440371133.

మహారాజు శ్రీ శ్రీకాకుళం 4వ అదనపు జిల్లా జడ్జి (SC/ST) కోర్టులో OS 75/2017

Between: **వడ్డి వెంకట విశ్వేశ్వరరావు వగైరాలు**
--వాదులు
And: **బూర్లె యర్రయ్య వగైరాలు**
- ప్రతివాదులు
To,
11.Balaga Appalasuri, S/o, తెలియదు, Hindu, aged 52 years, Cultivation, chodavaram Village. Dr.no: 6-7, Narasannapeta Mandal, Srikakulam district. ప్రస్తుతం హైదరాబాద్ అని భోగట్టా మాత్రమే
13.Vommaravalli Suryanarayana, S/o Appala Ramayya, Don Dr-no: 7-8, --Rest do-- ప్రస్తుతం విజయవాడ అని భోగట్టా మాత్రమే
18. Asuri Seethamma, W/o Surayya, Dr.no: 5-1/3, --Rest do-- ప్రస్తుతం విశాఖపట్టణం అని భోగట్టా మాత్రమే

పై నెంబరు వాదులు దావా షెడ్యూల్ దాఖల ఆస్తికి హక్కు దారులుగా నిర్ణయిస్తు షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేయమని ఇతర పరిహారములతో, పై నెంబరున దావా దాఖలు చేసియున్నందున మీకు నోటీసు నిమిత్తం **తే॥ 31-10-2023 దికి వాయిదా గాన పై తేదిని మీరు ఉదయం 10:30 గం॥ లకు** స్వయంగా కాని లాయరు గారి ద్వారా కాని పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరుచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించడమగునని ఇందు మూలంగా తెలుసుకొనవలెను.

కోర్టు వారి అనుమతితో

డి. సరళకుమారి
వాదుల తరపు న్యాయవాది, శ్రీకాకుళం.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

టిడిపితోనే సుస్థిర పాలన

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రంలో టిడిపితోనే సుస్థిర పాలన సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని బెజ్జిపుట్టుగలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు. కూల్చివేతలతో ప్రారంభమైన పాలన అరెస్టులు, నిర్బంధాలు, దౌర్జన్యాలు, దోపిడీలకు చేరుకుందని ఆరోపించారు. ఎవరైనా ఒక వ్యక్తిపై ఒక కేసు నమోదు చేసినప్పుడు అతను చేసిన తప్పు పేర్కొని పూర్తి ఆధారాలతో అరెస్టు చేస్తారని అన్నారు. కానీ, మాజీ సిఎం చంద్రబాబు విషయంలో ముందుగా అరెస్టు చేసి ఇప్పుడు అతను ఏమైనా తప్పులు చేసి ఉంటాడా? అని వెతుకుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, మణిచంద్ర ప్రకాష్, బెందాళం రమేష్, బెందాళం విజయ్, కొర్రాయి వాసు, పుల్లట రాజు, హరికృష్ణ, బిసాయి, వజ్జ రంగారావు, బెందాళం తిరుమల పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్హెచ్ ఫిజిక్స్ విభాగంలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సంతోష్కుమార్, డాక్టర్ ఎస్.హరిప్రసాద్, సురేష్ పట్నాయిక్ పక్కిలు నూతనంగా 'ఇంజినీరింగ్ ఫిజిక్స్ లేబొరేటరీ మాన్యువల్' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తన ఛాంబర్లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెఎన్టియు విజయనగరం మొదటి ఏడాది బిటెక్ విద్యార్థుల సిలబస్కు అనుకూలంగా ఫిజిక్స్ లేబొంటరీ ఎక్స్పరిమెంట్స్, డిటైల్డ్ ఎక్స్ప్లేనేషన్పై పూర్తి అవగాహన కల్గి ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెన్డీ డీన్ డాక్టర్ డి.ఆజాద్, హెచ్‌డి డాక్టర్ ఆర్.శాంతికుమార్, అసిస్టెంట్ హెల్డడి డాక్టర్ మల్ల రమణయ్య, అధ్యాపకులు డాక్టర్ టి.గుణవర్ధన్నాయుడు, కె.రవికుమార్, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

23న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు పాఠశాల విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు పూజ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని పెద్దమురహరిపురంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దుర్గాదేవి పూజ సందర్భంగా ఈ నెల 23న క్విజ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 21 లోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు వరుసుగా రూ.ఐదు, రూ.మూడు, రూ.రెండు వేలు అందజేస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు 9133601585, 9550207377 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేదల ఆరోగ్యానికి భరోసా 'సురక్ష'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మండలంలోని కేరాసింగిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను మంగళవారం పరిశీలించారు. ఓపి రిజిస్ట్రేషన్, డాక్టర్ల తనిఖీ గదులు, మందుల కౌంటర్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని శిబిరాలకు రప్పించాలన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తున్నామని సూచించారు. అవసరమైన వారికి అనంతరం మెరుగైన వైద్య పరీక్షల కోసం పెద్దాస్పత్రికి పంపించి వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఏమైనా చేయాల్సి వస్తే అందుకు తగిన సహకారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ను తిలకించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్కుమార్, జెడ్పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్ధన బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ బల యోగి, సర్పంచ్ పెద్ద బొంతు ఆదిలక్ష్మి, తహశీల్దార్ పి.నరోత్తం, ఎంపిడిఒ పి.చంద్రకుమార్, ఎంఇఒ ఎం.పద్మనాభం, వైద్యాధికారులు గ్రీష్మ, అలేఖ్య పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరులో సర్పంచ్ మొజ్జాడ రుక్మిణి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులైన బీర, వంకాయ, చిక్కుడు, బొప్పాయి, బెండ కూరగాయలను అమ్మకం చేపట్టారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, వైసిపి నాయకులు మొజ్జాడ చక్రపాణి, బుర్లె శ్రీను, జి.ఆనందరావు, సూపర్వైజర్ శాంతికుమారి, ఎంపిటిసి సూర్యనారాయణ పాల్గొన్నారు.

లావేరు : పేద ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమని, అందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొర్లె కిరణ్కుమార్ అన్నారు. మండలంలోని బుడతవలసలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్సును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ కె.సురేష్కుమార్, తహశీల్దార్ సాధు దిలీప్చక్రవర్తి, సర్పంచ్ రౌతు సురేంద్ర, మాజీ ఎంపిపి డి.రాజనాయుడు, జెసిఎస్ ఇన్చార్జి మీసాల శ్రీనివాసరావు, వైద్యులు మౌనిక, సౌమ్య, రౌతు కూర్మరావు, పెంటంనాయుడు పాల్గొన్నారు.

రణస్థలం : జె.ఆర్.పురం-1లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను ఎమ్మెల్యే గొర్లె కిరణ్కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, జె.ఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ, గ్రామ సచివాలయం నోడల్ జిల్లా అధికారి వాసుదేవరావు, మండల ఎం.ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు కృష్ణచైతన్య, రజని పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని తులసిగాంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరం, ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు స్టాల్సును ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజకవర్గ ఇన్చార్జి పిరియా సాయిరాజ్ పరిశీలించారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్పర్సన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్.బాబూరావు, దువ్వు వివేకానంద, దున్న గురుమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖరరెడ్డి, జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, సర్పంచ్ రోకళ్ల పార్వతి, రంపత్ని చిట్టిబాబు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం సచివాలయం వద్ద నిర్వహించిన ఆరోగ్య సురక్షలో నియోజకవర్గ ఇన్ఛార్జి పిరియా సాయిరాజ్ పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్పర్సన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పార్టీ అధ్యక్షులు బలివాద ప్రకాష్పట్నాయక్, మండల జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, నర్తు శివాజీ పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని సహలాపుట్టుగలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్స్ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బాబూరావు, వైస్ చైర్మన్ వె. నీలయ్య, డి.భద్రాచలం, ఎన్ని అశోక్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఒ నాగరాణి, ఎపిఎం గోవిందరావు, అంగన్వాడీ సూపర్వైజర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరమని ఎంపిడిఒ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని మెట్టూరులో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య, జోగి అప్పారావు, డిటి గిరి, మోహనరావు, కార్యదర్శి అప్పారావు, వైద్యులు విజయకుమార్రెడ్డి పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని చల్లవానిపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి వాన గోపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి చల్ల వంశీ, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షులు పాగోటి రాజప్పలనాయుడు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: ఆరోగ్య సురక్షతో ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని తొలుసూరుపల్లి సచివాలయంలో సర్పంచ్ బగాది రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే వైద్య శిబిరం, డ్వాక్రా వస్తువుల స్టాల్సును పరిశీలించారు. అనంతరం రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో దువ్వాడ హైందవి, మోహన్, ఎంపిటిసి ప్రతినిధి చింతాడ అప్పన్న, వైద్యులు పాల్గొన్నారు.

సోంపేట : గ్రామల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పి చైర్పర్సన్ కోరారు. మండలంలోని బేసి రామచంద్రపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పిటిసి తడక యశోద, ఎంపిపి డాక్టర్ దాసు, సర్పంచ్ రోహిణి, బి.శ్రీకృష్ణ, వి.సుజాత పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని గొల్లలవలస సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షను డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి పి.జగన్, ఎంపిటిసి ప్రతినిధి సూరపు జయరాం, ఆర్.త్రినాథరావు, డిటి పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఉషశ్రీ, వైద్యులు శ్రీనాథ్, రత్నంరాజు, చందనం విస్తరణ అధికారి ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబడాంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షను చైర్మన్ బల్ల గిరిబాబు పరిశీలించి రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, కౌన్సిలర్ ప్రతినిధి రమణ పాల్గొన్నారు. అలాగే బంటుకొత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, ఎంపిడిఒ ఎస్.రమేష్నాయుడు, సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు, మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, వైద్యులు బి.గోపాల్ పాల్గొన్నారు.

లావేరు : వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్కుమార్

కొత్తూరు : స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి : వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

పలాస : వైద్యాధికారితో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

టెక్కలి రూరల్ : స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

మాట్లాడుతున్న ప్రసాద్

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ కళాశాల రహదారిలో మురుగు నీటి సమస్య పరిస్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక నివాస వాసులతో మంగలవారం విలేకరులతో మాట్లాడారు. ఏడాది కాలంగా ఈ మురుగు నీటి సమస్య పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. మురుగు నీరు రహదారిపై ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎరుక్కొంటున్నారని అన్నారు. మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు విజృభించి స్థానికులు రోగాలు బారిన పడుతున్నారని అన్నారు. తక్షణమే మూసిన కల్వర్టు తెరిపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కాలువ నిర్మాణం పూర్తి చేసిన నీరు వెళ్లేందుకు మార్గం చూపకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. రెండో వైపు కూడా కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. ఈయనతో పాటు ఈపు సీతంనాయుడు, వైశ్యరాజు, పి.రాజు, బి.సొంటి, మహేష్, సత్యనారాయణ, ప్రమీలకుమారి, జయకుమారి, భోగి రమేష్, వాసు, సాయి ఉన్నారు.

కరాటేలో వెంకటేష్‌కు కాంస్యం

ప్రజాశక్తి- పలాస

కాంస్య పతకాన్ని అందుకుంటున్న వెంకటేష్

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తాలో ఇటీవల నిర్వహించిన మూడో ఈస్టు ఇండియా కరాటే ఛాంపియన్ టోపీ పోటీల్లో బొడ్డపాడుకు చెందిన మద్దిల వెంకటేష్ కాంస్య పతకం సాధించారు. వెంకటేష్ తండ్రి తాతారావు అండమాన్‌లో స్థిరపడ్డారు. వెంకటేష్‌కు పతకం రావడంపై బొడ్డపాడుకు చెందిన జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీశ్వరరావు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్రీరాములు, తదితరులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

శ్రీకాకుళం అర్బన్: రెవెన్యూశాఖలోని సమస్యలను పరిష్కరించాలని, అర్హత ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి ఎం.నవీన్‌ను మంగళవారం కలిసి వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, జిల్లా కోశాధికారి జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు డి.సోనికిరణ్, టెక్కలి డివిజన్ అధ్యక్షులు కె.ప్రవల్లికాప్రియ, ఇసి మెంబర్ డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సంతోష్ పాల్గొన్నారు.

శివారు భూముల రైతుల ద్రోహి శివాజీ

మాట్లాడుతున్న మధుకేశ్వరరావు

వజ్రపుకొత్తూరు: వంశధార శివారు రైతులకు అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ ద్రోహం చేశారని పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వంశధార శివారు రైతులతో కలసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వంశధార శివారు భూములకు సాగునీరు అందడం లేదని టిడిపి నాయకులు గౌతు శిరీష కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేయడం అర్థరహితం అన్నారు. టెక్కలి నియోజకవర్గం పరిధిలో అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు అనధికారికంగా 17 లిఫ్ట్‌ల నిర్మాణం చేపడితే... అప్పటి ఎమ్మెల్యే శివాజీ నిద్రపోయారా? అని ప్రశ్నించారు. వంశధార శివారు రైతులపై మీకు నిజంగా ప్రేమ ఉంటే ముందుగా మీ నాన్న శివాజీని నిలదీసి అప్పుడు స్పందనలో ఫిర్యాదు చేసుంటే బాగుండేదని అన్నారు. మదనగోపాలసాగరం వద్ద బైపాస్ చేస్తూ కాలువ నిర్మాణం కోసం మంత్రి అప్పలరాజు కృషి చేశారని అన్నారు. బెండిగెడ్డపై లిఫ్ట్ ఇరిగేషన్‌కు మంత్రి కృషి చేసి జిఒ తీసుకొచ్చారని చెప్పారు. సమావేశంలో పిఎసిఎస్ డైరెక్టర్ బగాది హరికృష్ణ, సర్పంచ్‌లు నర్తు లక్ష్మీనారాయణ, తమ్మినేని ఢిల్లీరావు, పీత మోహనరావు, హనుమంతు ముకుందరావు, శిష్టు గౌతం, బాడ నీలాచలం, హనుమంతు బాలకృష్ణ పాల్గొన్నారు.

పొందూరు : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రాపాకలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 98 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిది కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, వైస్ ఎంపిపి వండాన శ్రీదేవి, వండాన వెంకటరావు, ఎంపిటిసి-2 ప్రతినిధి కోట నాగరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, తహశీల్దార్ వై.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ...

సోంపేట : అర్హులందరికీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బారువ 1, 2 సచివాలయాల పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జి.శ్రీనివాసరావు, సర్పంచ్ ఎర్ర రజిని, నాయకులు పి.రాజేశ్వరరావు, టి.పద్మావతి, ఎం.సునీత, ఎం.తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, సత్యం పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టు మృతికి సంతాపం

ఆమదాలవలస : పట్టణానికి చెందిన జర్నలిస్టు సనపల చక్రధర్ ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందిన విషయం విధితమే. దీంతో జర్నలిస్టులు పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం సంతాపసభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పైడి రాము, తాండ్ర అప్పలనాయుడు, దవల శ్రీను, పేడాడ వాసు, పాత్రుని రామ్మోహన రావు, అన్నెపు మోహనరావు, ఢిల్లీ పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాలను వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న శంకరరావు, రమణమూర్తి

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం దసరా సెలవుల్లో మూడో రోజు శిక్షణా శిబిరాన్ని డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ దసరా సెలవుల్లో విద్యార్థులందరూ గ్రంథాలయానికి వచ్చి కొంత సమయం గడపడంతో జ్ఞానం పెరుగుతుంది. కొత్త విషయాలు తెలుస్తాయని అన్నారు. పఠనాసామర్థ్యం పెరుగుతుందన్నారు. సొంతంగా అర్థం చేసుకోవడం, పిల్లలే కథనాలు తయారు చేసే సామర్థ్యం వస్తుందని చెప్పారు. అనంతరం పిల్లలకు పొడుపు కథలు, జీవిత చరిత్రలు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పి.రామ్మోహన్, సరోజని పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలు

లావేరు : జిల్లాల్లోని గ్రంథాలయాల్లో దసరా సెలవులు సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. లావేరు శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో కె.లహరికి ప్రథమ, సౌజన్యకు ద్వితీయ, ఆరవల్లి శ్రీనిధికి తృతీయ, కీర్తికకు కన్సోలేషన్ బహుమతి వచ్చాయి. వీరికి గ్రంథాలయం తరుపున గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

పలుచోట్ల 'బాబుతో నేను'

బూర్జ: మండలంలో తుడ్డలిలో చంద్రబాబు అక్రమ అరెస్టులను ఖండిస్తూ స్థానిక సర్పంచ్ అంపిలి రూపవతి ఆధ్వర్యాన 'బాబుతో నేను' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం సిఎం జగన్ చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేశారని అన్నారు. నిత్యావసర సరుకులు అమాంతంగా పెరగడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సర్పంచ్ గణపతి, అప్పలనాయుడు, రమేష్, రాము, పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని బాణం పంచాయతీ బాపిరాజుపేటలో క్లస్టర్ ఇన్‌చార్జి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు ఆధ్వర్యాన మంగళవారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు అక్రమ అరెస్టు, వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా పోస్టర్లను అందజేశారు. మాజీ సర్పంచ్ కింజరాపు వెంకటరమణ, అప్పారావు, సోములు, గాంధీ పాల్గొన్నారు.

పొందూరు : పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

బూర్జ : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

మాట్లాడుతున్న గౌతు శిరీష

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలంలోని బెండిలో క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ స్థాయిలో పోల్ మేనేజ్‌మెంట్ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఓటరు లిస్టునూ క్షణంగా పరిశీలించాలన్నారు. దొంగ ఓట్ల చేరకుండా జాగ్రత్త వహించాలన్నారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు నిలబడవని, కొంత సమయం పట్టినా నిరపరాధిగా బయటకు వస్తారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మోహనరావు, దుర్యోధన, కణితి సురేష్, తమిరియా భాస్కర్, ఎంపిటిసి చిట్టిబాబు, చక్రవర్తి, శశిభూషణ్ పాల్గొన్నారు.

సిక్కోలు క్రీడాకారులకు పతకాల పంట

ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

శ్రీకాకుళం అర్బన్ : ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కుంఫ్యూ, కరాటే పోటీల్లో సిక్కోలుకు చెందిన 25 మంది క్రీడాకారులు బంగారు, వెండి పతకాలను సాధించారు. శ్రీకాకుళం నగరంలోని వివిధ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు, అమర్ కౌముది విద్యార్థుల్లో 19 మంది బంగారు, ఆరుగురు వెండి పతకాలు అందుకున్నారు. వీరిని నగరంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపం ఆవరణలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన మంగళవారం విజేతలకు సన్మానించారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్, గ్రాండ్ మాస్టరు మండా విజయకుమార్, ప్రధాన శిక్షకులు వై.హేమంత్ కుమార్, శిక్షకులు డి.హరీష్‌లు ధ్రువపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

క్రమశిక్షణ అవసరం

టెక్కలి : చదువుకునే విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ జీవితాన్ని అంచనా వేసుకుని ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఐక్యూ కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, స్టాఫ్ కార్యదర్శి డి.వాసుబాబు, పరీక్షల నిర్వహణాధికారి పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమిష్టిగా పనిచేయాలి

ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- జలుమూరు

ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతతో సమిష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వాన గోపి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని అన్నారు. ఇళ్లు అవసరమైన వారు చాలా మంది ఉన్నారని, ఇళ్లు మంజూరైన తర్వాత నిర్మించకపోతే వారితో మాట్లాడాలన్నారు. దీని కోసం క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేసి పేర్లను గుర్తించాలన్నారు. ముందుగా శాఖల వారీగా సమీక్షించారు. ఇంటింటికీ కుళాయిలో భాగంగా శ్రీముఖలింగంలో ఇస్తున్న కనెక్షన్లకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఎంపిటిసి కె.హరిప్రసాద్ సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఆర్.చైతన్యకుమార్ మాట్లాడుతూ ఎవరైనా డబ్బులు కలెక్షన్ చేసినట్లయితే తనకు తెలియజేస్తే వారి జీతాల్లో కట్ చేస్తామన్నారు. అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని నగిరికటకం ఎంపిటిసి బగ్గు రామకృష్ణ కోరారు. శ్రీముఖలింగంలో కూలీలు ఎక్కువగా ఉన్నారని, వారిరీ వందరోజుల పని కల్పించేందుకు ప్రణాళికలు వేయాలని ఎమ్మెల్యే ఎన్ఆర్ఇజిఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, డిటి పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

మహిళా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం పభుత్వ మహిళా కళాశాల 2023-24కు మూడో కౌన్సెలింగ్ తర్వాత ఖాళీలను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 వరకు నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు ప్రాసెసింగ్ ఫీజు రూ.400 చెల్లించాలని అన్నారు. అలాగే ఈ నెల 20, 21న అదనపు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా చేరిన విద్యార్థులకు విద్యా దీవెన వర్తించదని, మొత్తం ఫీజులను విద్యార్థులే చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. అభ్యర్థులు 7842610285 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

రాజమండ్రి నిరసనలో శంకర్‌రెడ్డి

ఇచ్ఛాపురం : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రిమాండ్‌కు విధించడంపై రాజమండ్రి సెంట్రల్ జైల్ వద్ద టిడిపి నాయకులు మంగళవారం చేపట్టిన నిరసన దీక్షలో ఇచ్ఛాపురానికి చెందిన బిసి సాధికారిత సమితి రాష్ట్ర కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం కక్షపూరితంగా చంద్రబాబుపై తప్పుడు కేసు నమోదు చేసి అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్సీ ద్వారపు రామారావు పాల్గొన్నారు.

పాల్గొన్న శంకర్‌రెడ్డి

జాతీయ క్రీడల్లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి- పలాస

తెలంగాణ రాష్ట్రం వరంగల్లో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగిన 34వ సౌత్ జోన్ నేషనల్ పోటీల్లో పలాస న్యూకాలనీకి చెందిన పోతనపల్లి యశ్వీత అండర్-14వ విభాగం హైజంప్‌లో కాంస్య పతకం సాధించింది. యశ్వీత ఎంజెపి స్కూల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. సూదికొండ, శివాజీ నగర్ చెందిన అడప యామిని 3 వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం గెలుచుకుంది. యామిని డాక్టర్ వికలేజీస్ ప్రభుత్వ ఐటిఐలో మొదటి సంవత్సరం ఎలక్ట్రికల్ ట్రేడ్ చదువుతుంది. అలాగే కొర్లాంకు చెందిన రాంబుడ్డి మహేష్ అండర్-20 విభాగం 10 వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం గెలుపొందారు. మహేష్ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ ముగ్గురు అథ్లెటిక్ కోచ్ కొనతాల రామారావు వద్ద శిక్షణ పొందుతున్నారు. నేషనల్ పోటీల్లో ముగ్గురు మూడు కాంస్య పతకాలు సాధించడంపై పీడీ రాజ్యలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు.

పతకాలతో క్రీడాకారులు

విచారణ చేస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

చెరువు ఆక్రమణపై విచారణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో బెల్లుపడ వద్ద ఉన్న కోటేరు బంద చెరువు ఆక్రమణపై పలాస ఆర్‌డిఒ సీతారామ్మూర్తి మంగళవారం విచారణ నిర్వహించారు. ఇటీవల కలెక్టర్ నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో చెరువు ఆక్రమణపై పలువురు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఒ సమగ్ర విచారణ చేపట్టారు. మొత్తం చెరువు విస్తీర్ణం 35.22 సెంట్లు, ఆక్రమణలు 10. 50 సెంట్లు, డీపట్టాలు 2.29, దేవుడు భూమి0.33 సెంట్లు, ప్రస్తుతం 22.10 సెంట్లు, భూమి చెరువు బ్యూటిఫికేషన్ సిద్ధంగా ఉందన్నారు. చెరువుకు ఆనించి ఇళ్లు కట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిటి శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ రమేష్, మండల సర్వేయర్ తవిటినాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

రబీ పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వరి పంట తర్వాత వేసుకునే ప్రధాన పంటల్లో అంతర పంటలుగా పలు రకాల కాయగూరలు సాగు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట పోలీసు అన్నారు. ఎచ్చెర్ల మండలం కొంగరాంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు చేత రబీ పంటలు సాగు విధానంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర పంటలు వేసుకోవడంతో రైతులకు అదనపు ఆదాయంతో పాటు నేల సారవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండ రవి, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, నీటి పారుదల అధ్యక్షులు సుధ పాల్గొన్నారు.

మాతృభూమి రుణం తీర్చుకోలేనిది

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కవిటి

మనం ఎన్ని త్యాగాలు చేసినా మాతృభూమి రుణం తీర్చుకోలేనిదని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం కవిటిలో నా మట్టి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల నిస్వార్థ కృషి నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్య్రమని అన్నారు. అనంతరం మాతృభూమి సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు పూడి లక్ష్మణరావు, బర్ల నాగభూషణం, పాండవ శేఖర్, యలమంచి నీలయ్య, శివ బిశాయి, పులకల శ్రీరాములు, దుద్ది సతీష్, బెందాళం రమణమూర్తి, చందాన పూర్ణ చంద్రుడు, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఇఒ వీరభద్రస్వామి పాల్గొన్నారు.

ఆమదాలవలస: అమృత కళశాల కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయం నెహ్రూ యువ కేంద్రం, స్థానిక అరుణోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యాన మేరా మట్టి... మేరా దేశ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నా దేశం నా భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. వాతావరణం, వేడి, వ్యాధులు వంటి వాటిని నివారించాలంటే కాలుష్యాన్ని నివారించాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ముందుగా ఎంపిడిఒ కార్యాలయం నుంచి కృషి విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డి.గోవిందరావు, ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ, ఇసి గట్టి రాము, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్ కేసారం అప్పలరాజు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మేరా మట్టి... మేరా దేశ్ - అమృత కలశాల్లో భాగంగా ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యాన అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిపి రోణంకి ఉమామహేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు, హేమసుందం ాజు, జి.హరిప్రసాద్, టి.కుమారస్వామి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఎంపిడిఒ పి.చంద్రకుమారి ఆధ్వర్యాన నా భూమి-నా దేశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు మొక్కలను నాటారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభం, ఎపిఎం లలిత, జయముని, అప్పారావు, శివాజీ పాల్గొన్నారు.

పలాస : మన మట్టి... మన దేశంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యాన ఎంపిడిఒ రమేష్‌నాయుడు మొక్కలను నాటారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, ఉపాధ్యాయులు అంబలి కృష్ణారావు, దాసరి వైకుంఠరావు, నూకల హేమసుందర్, మండల ఎఒ అనురాధ, బి.వి. రమణమూర్తి, లక్ష్మణరావు, ఉషారాణి, కార్యదర్శి సుధాశ్రీధర్, చైతన్య సద్గుణబాబు, ఖగేశ్వరరావు, చౌదరి, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ అధికారుల ఆధ్వర్యాన టెక్కలిలో నా మట్టి- నా దేశం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయ్, డిఎల్‌పిఒ ఐ.వి.రమణ, ఇఒపిఆర్‌డి బి.మల్లేశ్వరరావు, కార్యాలయ ఎఒ హెచ్.వి.రమణమూర్తి, ఎపిఒ ప్రసాద్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

లేఅవుట్ల పరిశీలన

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మపురం, మెళియాపుట్టి, వసుంధర, గొప్పిలి గ్రామాల్లోని ప్రయివేటు లేఅవుట్లను టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం పరిశీలించారు. అందుకు సంబంధించి భూ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్లాట్లు వేయాలని సూచించారు. ఈయనతో పాటు తహశీల్దార్ పి.సరోజిని, ఆర్‌ఐ వైకుంఠరావు, విఆర్‌ఒలు అన్నాజీరావు, వసంతరావు ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సెల్‌టవర్ వద్దు

పొందూరు: పట్టణంలోని లావేటి వీధి వద్ద సెల్‌టవర్ నిర్మాణానికి వ్యతిరేకిస్తూ ఆ ప్రాంత వాసులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇటీవల సెల్‌టవర్ నిర్మాణానికి గోతులు తవ్వొద్దని నిర్మాణదారులకు సూచించారు. సెల్‌టవర్ నిర్మాణం వల్ల వాటి ద్వారా వెలువడే రేడియేషన్ కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, కాబట్టి ఇక్కడ ఏర్పాటు చేయొద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ వై.వి.ప్రసాద్‌కు, పంచాయతీ ఇఒ రమేష్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఇఒ మాట్లాడుతూ సెల్‌టవర్ నిర్మాణానికి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

మహేష్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాంకు చెందిన మహేష్ రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు కోచ్ పెట్టింటి నరేష్ మంగళవారం తెలిపారు. ఇటీవల వరంగల్లో జరిగిన పాఠశాల స్థాయి పోటీల్లో మహేష్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. అంతకుముందు పదివేల మీటర్ల పరుగు పందెంలో సైతం రజిత పతకాన్ని జిల్లా స్థాయిలో సాధించినట్లు తెలిపారు. మహేష్‌కు సర్పంచ్ రాబుడ్డి గణపతి, గ్రామ పెద్దలు అభినందించారు.

బంగారు పతకంతో మహేష్

అభివృద్ధిని చూసి ఓర్వలేకే 'పేరుకట్ల' విమర్శలు

బూర్జ: మండలంలోని అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్సీ పేరుకట్ల విశ్వప్రసాద్ విమర్శలు చేస్తున్నారని సచివాలయాల మండల కో-ఆర్డినేటర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి రాంబాబు అన్నారు. మండలంలోని తోటవాడలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్లలో చేయలేని పనులను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సారథ్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. తోటవాడ రైతాంగం కల గోర్జ రోడ్డు, శ్మశాన వాటిక సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. మీ సొంత గ్రామం రాజుపేటలో శ్మశాన వాటికకు రోడ్డు వేయలేని... మీరు పంచాయతీని అభివృద్ధి చేశామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొల్లివలస సంత ఆక్రమణలు, రాజుపేటలో గ్రామ కంఠం భూములు, చెరువు స్థలాల ఆక్రమణలు మీ అధికార దాహానికి నిదర్శనాలు దర్శనమిస్తున్నాయని విమర్శించారు. ఈయన వెంట సర్పంచ్ సూర ఆనందరావు, ఎంపిటిసి ప్రతినిధి సుధాకర్, నాయకులు ఎస్.గోవిందరావు, గేదెల జోగినాయుడు, గేదెల నారాయణమూర్తి, కొత్తకోట నాగేశ్వరరావులు ఉన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

రికార్డులు పరిశీలన

ఇచ్ఛాపురం : స్వయంశక్తి సంఘాల రికార్డుల నమోదు సక్రమంగా ఉండాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. స్వయంశక్తి సంఘాల పనితీరు, రికార్డులను మంగళవారం పరిశీలించారు. రుణాలు, శ్రీనిధి, బ్యాంకు లింకేజీ, అంతర్గత అప్పులు, చెల్లింపులపై ఆరా తీశారు. పుస్తక నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సిసి మోహనరావు ఉన్నారు.

భువనేశ్వరితో టిడిపి నాయకులు

మాట్లాడుతున్న స్వామిదాసు

శ్రీకాకుళం అర్బన్ : క్రైస్తవునిగా చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బైబిల్ వాచకానికి భిన్నంగా అరాచక వాదిగా తయారయ్యారని, ఎదుటి వారిని ప్రేమించేతత్వం విడిచి పెట్టారని టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు, ప్రధాన కార్యదర్శి బోసుబాబు ఆరోపించారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

ఫాస్టర్‌పై దాడి అమానుషం

జిల్లాలో పాస్టర్స్‌పై దాడిని ఖండిస్తున్నామని అన్నారు. సిబి సిఎంసి ఆస్తులను కబ్జా చేసిన వారిని, కఠినంగా శిక్షించి, ఆస్తులను వెంటనే సంస్థకు అప్పగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రైస్తవులకు 11 సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. సమావేశంలో జిల్లా క్రైస్తవ సెల్ అధ్యక్షుడు కృపానందం, ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోర సురేష్, టెక్కలి క్రిస్టియన్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.సాల్మన్, ఎం.జోసేఫ్, టిడిపి ఉపాధ్యక్షుడు పి.ఎం.జి.బాబు, అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన టిడిపి నాయకులు

పలాస: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాజమహేంద్రవరంలో నారా భువనేశ్వరిని పలాస నియోజకవర్గం సీనియర్ టిడిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆదేశాల మేరకు నారా భువనేశ్వరిని కలిశామనిమాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్ కుమార్ తెలిపారు. ఆమె కలిసిన వారిలో జిల్లా రజక సాధికార కమిటీ కన్వీనర్ గుర్రపు సాల రామకృష్ణ, రాష్ట్ర కన్వీనర్ కొత్తపల్లి రామారావు, స్టేట్ కమిటీ సభ్యులు రట్టి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నెలకున్న రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహిళా మోర్చ జిల్లా అధ్యక్షులు మంగి లక్ష్మీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా జిల్లాస్థాయి పదవి రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని బిర్లంగిటూరు చెందిన లక్ష్మీరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసినందుకు తనకి పదవి అధిష్టానం ఇచ్చారని అన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రధాన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

లక్ష్మీరెడ్డి